సాక్షి
మంచిర్యాల

మంగళవారం : 21 : మార్చి : 2023



మిగిలింది పది రోజులే..

జిల్లాలోని లక్సెట్టిపేట మున్సిపాల్టీ పన్నుల వసూళ్లలో ముందంజలో ఉండగా.. మిగతా బల్దియాలు వెనుకబడ్డాయి. వంద శాతం వసూలు కష్టమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

8లో ▸

రాష్ట్రపతి నిలయం సందర్శనకు అవకాశం

మంచిర్యాలఅర్బన్: పాఠశాల విద్యార్థులు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం సందర్శనకు ఈ నెల 23నుంచి అవకాశం కల్పిస్తున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత ప్రవేశం ఉంటుందని, ఐడెంటి కార్డు ధరించాలని, ప్రతీ 20 మంది విద్యార్థులకు ఒక గైడ్ టీచర్ ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రపతి నిలయం సందర్శనకు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని సూచించారు. ప్రతీ సోమవారం సందర్శనకు సెలవు ఉంటుందని తెలిపారు.

గరిష్టం/కనిష్టం
31.0 /21.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది.

‘అమృత్’ స్టేషన్

- మంచిర్యాల రైల్వేస్టేషన్ ఎంపిక
- ఎస్కలేటర్, షాపింగ్ మాల్స్, సౌకర్యాలు
- ఇప్పటికే పలు అభివృద్ధి పనులు ప్రారంభం
- రైల్వే ప్రయాణికులకు తొలగనున్న ఇక్కట్లు


మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో నిర్మాణంలో ఉన్న రెండో ఫుట్ ఫై ఓవర్ బ్రిడ్జి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో అతి పెద్ద రైల్వే స్టేషన్‌గా ఉన్న మంచిర్యాల స్టేషన్‌లో మరిన్ని వసతులు పెరగనున్నాయి. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ‘అమృత్ భారత్ స్టేషన్’ పథకం కింద ఈ స్టేషన్‌ను ఎంపిక చేయడంతో సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ఇప్పటికే ఇక్కడి అధికారులు స్టేషన్‌లో కావాల్సిన అవసరాలపై ప్రతిపాదనలు పంపించారు. గతంలో మంజూరైన పనులకు సంబంధించి నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇటీవల దక్షిణ మధ్య రైల్వే డివిజన్ రీజినల్ మేనేజర్ అభయ్‌కుమార్ గుప్త సందర్శించారు. వసతుల కల్పనపై జరుగుతున్న పనులను తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని వసతులు అందుబాటులోకి రానున్నాయి. రోజు రోజుకు రైల్వే ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. అరకొర సౌకర్యాల మధ్య ప్రయాణం సాగిస్తుండగా.. ఇక ఇక్కట్లు తొలగిపోనున్నాయి.

పథకంతో లబ్ధి

దేశవ్యాప్తంగా 200 పెద్ద రైల్వేస్టేషన్లు అభివృద్ధి చేయాలనే తలంపుతో కేంద్రం అమృత భారత్ స్టేషన్ పథకం అమల్లోకి తెచ్చింది. మొదటి దశలో ఉత్తర భారతదేశంతోపాటు దక్షిణ మధ్య రైల్వే పరిధిలో పలు చోట్ల అభివృద్ధి పనులు చేపట్టింది. తాజాగా మంచిర్యాల రెండో విడతలో ఎంపిక కావడంతో ఈ మేరకు కనీస వసతులు మెరుగు పడనున్నాయి. ఈ పథకంలో రద్దీగా ఉండే స్టేషన్లలో ప్రయాణికులకు కనీసం తాగునీరు, మరుగుదొడ్లు, వెయింటింగ్ హాల్, ఆధునిక టికెట్ కౌంటర్లు, ప్లాట్ ఫాం అభివృద్ధి, మోడల్ షాపింగ్ మాల్స్, ఎస్కలేటర్లు, సులభ్ కాంప్లెక్స్‌లు తదితర సౌకర్యాలు కల్పిస్తారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న వసతులకు అదనంగా ఈ సౌకర్యాలు కల్పించనున్నారు. గతంలో ప్రజాప్రతినిధులు రైల్వేస్టేషన్లలో వసతుల కోసం వినతులు ఇచ్చారు. ఇక ఏటా ఉన్నతాధికారుల సందర్శనలోనూ స్థానిక ప్రయాణికులు, ప్రజాప్రతినిధులు సూపర్‌ఫాస్ట్ రైళ్ల హాల్టింగ్స్, కొత్త రైళ్ల ప్రతిపాదనలు, సౌకర్యాల కల్పన పెంపు కోరుతూనే ఉన్నారు. ఈ క్రమంలో మంచిర్యాల రైల్వేస్టేషన్‌కు మరిన్ని సౌకర్యాలు కలిగితే ప్రయాణికుల ఇక్కట్లు తప్పనున్నాయి.


రెండో ప్లాట్ ఫాం వైపు నిర్మిస్తున్న బుకింగ్ కౌంటర్

ఎస్కలేటర్, వ్యాపార సముదాయాలు

మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించాలని స్థానిక అధికారులు సౌత్ సెంట్రల్ రైల్వే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ఇందులో ఫుట్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఎక్కేందుకు ఎస్కలేటర్ నిర్మించాలని కోరారు. మరుగుదొడ్ల కోసం సులభ్ కాంప్లెక్సులు, తాగునీరు, రెండో ప్లాట్ ఫాం కూడా వసతులు కల్పించాలని కోరారు. మెయిన్ గేట్ ముందర షాపింగ్ కాంప్లెక్సులు నిర్మించి, ప్రైవేటు వ్యక్తులకు అద్దెకు ఇచ్చి ఆదాయం సమకూర్చేలా ప్రణాళికలు వేశారు. మెయిన్ గేటు పరిసరాల్లో ఖాళీ స్థలంలోనే షాపింగ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు కానున్నాయి. స్టేషన్ సౌకర్యాల కల్పనపై చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్‌ను ‘సాక్షి’ సంప్రదించగా.. సౌకర్యాల పెంపుపై ప్రతిపాదనలు పంపించామని, ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు ఈ మేరకు పనులు చేపడుతారని తెలిపారు. ఇందులో కొన్ని పనులు ప్రారంభమైనట్లు వివరించారు.

స్టేషన్‌కు ఒక వైపే సౌకర్యాలు

మంచిర్యాల రైల్వేస్టేషన్ నుంచి నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న ఈ స్టేషన్ గుండా, ఉత్తర, దక్షిణ భారతదేశానికి కలిపే కీలక మార్గంలో ఉన్నప్పటికీ మొదటి నుంచీ సరిపడా సౌకర్యాలు లేవు. టికెట్ల తో రూ.లక్షల్లో ఆదాయం, గూడ్స్ తరలింపుతో రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. ప్రయాణికులు రోడ్డు మార్గం ఖర్చుతో కూడుకోవడంతోపాటు రై లు ప్రయాణం సురక్షితం, తక్కువ ఖర్చు కావడంతో అనేకమంది ప్రయాణం చేస్తున్నారు. జిల్లా కేంద్రంగా ఉన్న మంచిర్యాల స్టేషన్‌కు అనేక సదుపాయాలు కరువయ్యాయి. స్టేషన్‌కు ఒకవైపే సౌకర్యాలు ఉన్నాయి. మొదటి ప్లాట్ ఫాం వైపు తాగునీరు, మరుగుదొడ్లు, టికెట్ కౌంటరు, పార్కింగ్ సౌకర్యం ఉన్నాయి. రెండో వైపు ఎటువంటి సౌకర్యాలు లేవు. కనీసం అటువైపు చివరి వైపు వెళ్లాలంటే కూ డా కష్టమే. టికెట్ కౌంటర్లు, తాగునీరు, పార్కింగ్, లిఫ్టు సౌకర్యం లేదు. దీంతో రెండో వైపు సౌకర్యాలు ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. అటువైపు సౌకర్యాలు లేక ప్రతీసారి మొదటి ప్లాట్ ఫాం వైపు వచ్చి టికెట్ తీసుకుని కొందరు అటువైపు వెళ్తున్నారు. ఇటీవల ఈ సమస్యను గుర్తించిన అధికారులు రెండో వైపు బుకింగ్ కౌంటర్ నిర్మాణం చేపట్టారు.

విద్యార్థుల ఆరోగ్యమే ధ్యేయం

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు
- టీచర్లు, వైద్య సిబ్బందికి అవగాహన


పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో, డీఈవో

మంచిర్యాలటౌన్: ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్యమే ధ్యేయంగా పనిచేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సోమవారం జిల్లాలోని 18 మండలాల నుంచి 158 మంది ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందికి ఆరోగ్యంపై రెండ్రోజుల అవగాహన, శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రాథమికోన్నత స్థాయి నుంచి సీనియర్ సెకండరీ స్థాయి వరకు విద్యార్థులకు వారి మానసిక, శారీరక ఆరోగ్యంపై సమగ్ర అవగాహన ఉండాలని అన్నారు. జాతీయ విద్యా శిక్షణ పరిశోదన సంస్థ తయారు చేసిన 13 రకాల మాడ్యూల్స్‌పై ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఆరోగ్యంపై అవగాహన పోస్టర్లు విడుదల చేశారు. డీఈవో వెంకటేశ్వర్లు, ఎస్ వో చౌదరి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అనిత, డాక్టర్ నీరజ, డాక్టర్ ఫయాజ్‌ఖాన్, డాక్టర్ సునిల్, ఆర్‌బీ ఎస్‌కే వైద్యులు వి.వెంకటేశ్వర్‌రావు, కె.రామకృష్ణ, ప్రేమ్ కుమార్, డీపీవో ప్రశాంతి, డెమో బి.వెంకటేశ్వర్, డీఆర్పీలు దత్త కుమార్, సంధ్యారాణి పాల్గొన్నారు.

ఐటీఐలో 149మంది ఎంపిక

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో సోమవారం నిర్వహించిన నేషనల్ అప్రెంటిషిప్ మేళాలో 149 మంది ఎంపికయ్యారు. మూడు కంపెలు ప్రతినిధులు పాల్గొనగా 256 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు 149 మందిని ఎంపిక చేశారు. ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్, శ్రీరాంపూర్, మందమర్రి ఐటీఐ ప్రిన్సిపాల్ రవీందర్, దేవానంద్, ట్రేనింగ్ ఆఫీసర్లు సునీల్, డీటీవో శ్రీధర్‌రాజు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అండర్ బ్రిడ్జి సమస్య పరిష్కరించండి


రైల్వే జీఎంను కలిసిన ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రం మంచిర్యాలలో నూతనంగా నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కోరారు. సోమవారం రైల్వేనిలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యను వివరించారు. రైల్వే అండర్ బ్రిడ్జి కింద చిన్నపాటి వర్షాలకే వరద నీరు చేరి రాకపోకలకు అంతరాయం కలుగుతోందని తెలిపారు. నీరు నిలువ ఉండకుండా శాశ్వత పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జీఎం త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌పై వైస్ చైర్మన్ ఫిర్యాదు


కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న శ్రీనివాస్

నస్పూర్: నస్పూర్ మున్సిపల్ కమిషనర్ రమేశ్‌పై మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్ కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం ఆయన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ తన వార్డులో అభివృద్ధి పనులను జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. చిల్డ్రన్ పార్కు, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు పది నెలల క్రితం పట్టణ ప్రగతి నిధుల నుంచి సుమారు రూ.50 లక్షలు కేటాయిస్తూ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను త్వరగతి చేపట్టాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

‘ప్రభుత్వ అసమర్థతతోనే ప్రశ్నపత్రాల లీకేజీ’


మాట్లాడుతున్న రఘునాథ్

బెల్లంపల్లి: రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతతోనే టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలు లీకయ్యాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ విమర్శించారు. సోమవారం బెల్లంపల్లి కాంటా చౌరస్తా వద్ద టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేపర్ లీకేజీ కారణంగా ఎంతో కష్టపడి చదువుకుంటున్న నిరుద్యోగుల ఆశలన్నీ ఆవిరయ్యాయని అన్నారు. పేపర్ లీకేజీలో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ హస్తం ఉందని ఆరోపించారు. మంత్రి కేటీఆర్ నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని, జరిగిన ఘటనపై సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మెన హరీష్‌గౌడ్, తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణ దేవరాయలు, పట్టణ అధ్యక్షుడు కోడి రమేష్, నాయకులు కేశవరెడ్డి, రాజలింగు, కోయిల్కార్ గోవర్ధన్, మాను రజిని, అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు కొయ్యల ఏమాజీ, రాజులాల్‌యాదవ్, బీజేపీ మండల అధ్యక్షులు మల్లేష్, సత్యనారాయణ, రామన్నయాదవ్, శైలేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక ఉల్లాసం


మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

మంచిర్యాలఅర్బన్: యోగాతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని డీఈవో వెంకటేశ్వర్లు న్నారు. సోమవారం స్థానిక సరస్వతీ శిశు మందిర్‌లో 76 మంది పీఈటీ, పీడీలకు అరుణ యోగా ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ సహకారంతో ఐదు రోజులపాటు నిర్వహించే శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో ఆరోగ్య పరంగా అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు ప్రతీరోజు ఐదు నిముషాలు యోగ నేర్పించడం కోసం అరుణ యోగ సంస్థ ప్రత్యేకమైన సిలబస్‌ను తయారు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి శ్రీనివాస్, యోగనిపుణులు ఇందుమణి, సుందరశివరామ్ పాల్గొన్నారు.

ఉద్యాన వన నర్సరీకి పూర్వ వైభవం

- ఐటీడీఏ కసరత్తు
- మొక్కల పెంపకానికి కార్యాచరణ


బెల్లంపల్లి ఐటీడీఏ ఉద్యాన నర్సరీ ముఖద్వారం

బెల్లంపల్లి: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఆధ్వర్యంలో బెల్లంపల్లి కేంద్రంగా గురిజాలకు వెళ్లే మార్గంలో ఉన్న ఉద్యాన నర్సరీ, శిక్షణ కేంద్రానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కసరత్తు మొదలైంది. దశాబ్దన్నర కాలానికి పైగా తీవ్ర నిరాదరణ, నిర్లక్ష్యానికి గురైన ఉద్యాన వననర్సరీ పునరుద్ధరణకు ఎట్టకేలకు ఐటీడీఏ నడుం బిగించింది. ఇందులో భాగంగా 110 ఎకరాల్లో విస్తరించి ఉన్న నర్సరీలో ఏపుగా ఎదిగి పనికి రాకుండా ఉన్న చెట్లను తొలగించనున్నారు. వాటి స్థానంలో కొత్తగా ఫలసాయాన్ని ఇచ్చే మొక్కలు, పూల మొక్కలు, కాగితం తయారీకి ఉపయోగించి సర్వీ, సుబాబుల్, ఫామాయిల్ తదితర రకాల మొక్కలను పెంచడానికి కార్యాచరణ తయారు చేశారు. ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఉద్యానవన నర్సరీకి పూర్వ వైభవం తీసుకొచ్చే చర్యలకు ఉపక్రమించారు. ఈ పరిణామాలు ఉద్యాన వన నర్సరీ, శిక్షణ కేంద్రానికి ఎంతగానో దోహదపడనున్నాయని ఐటీడీఏ అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

వేప, తుమ్మ చెట్ల వేలం

ఉద్యానవన నర్సరీలో పనికి రాకుండా, ఫలసాయాన్ని ఇవ్వకుండా నిర్జీవంగా ఉన్న చెట్లను తొలగించాలని నిర్ణయించారు. ఈ మేరకు గత జనవరిలో సర్వే చేశారు. నర్సరీలో గుర్తించిన వృక్షాలు, పిచ్చిమొక్కలు సమూలంగా తొలగించడానికి గత ఫిబ్రవరిలో చెట్ల విక్రయానికి టెండర్ పిలిచారు. ఇటీవల టెండర్ ప్రక్రియ పూర్తయింది. నర్సరీ పరిధిలో 1,214 వేప చెట్లు, 239 తుమ్మ చెట్లు, 638 వివిధ రకాల చెట్లు విక్రయించాలని నిర్ణయించి టెండర్ పిలిచారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ సదరు వృక్షాలను నరికి తీసుకెళ్లడానికి అనుమతి ఇవ్వడంతో ఇకపై ఐటీడీఏ ఉద్యానవన శాఖ అధికారులు బెల్లంపల్లి నర్సరీపై ప్రధానంగా దృష్టి సారించడానికి సమాయత్తం అవుతున్నారు.

రైతులకు శిక్షణ లేనట్లే..?

ఉద్యానవన నర్సరీలో శిక్షణ కేంద్రం అయినప్పటికీ గతంలో రైతులకు సైతం ఎలాంటి శిక్షణ ఇవ్వలేదు. బెల్లంపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో సారవంతమైన ఇసుక, ఎర్రరేగడితో కూడిన నేలలు ఉన్నాయి. ఆ తీరైన భూమిలో పండ్ల మొక్కలు ఆరోగ్యంగా పెరగడానికి, అధిక ఫలసాయాన్ని ఇవ్వడానికి అవకాశాలు ఉంటాయి. ఐటీడీఏ నర్సరీలో శిక్షణ ఇప్పించి పండ్ల మొక్కల పెంపకంపై రైతులకు ఆసక్తి, అవగాహన కల్పించాలని తలపోసినా ఆచరణలో అమలు కావడం లేదు. ప్రస్తుతం నర్సరీ పునరుద్ధరణకు నడుం బిగించిన రైతాంగానికి శిక్షణ ఇచ్చే కార్యక్రమాలు దాదాపు లేనట్లేననే అనుమానాలు కలుగుతున్నాయి. ఎంతో విలువైన నర్సరీ వృథా కాకుండా వినియోగంలోకి తీసుకు రావడానికి చేస్తున్న కృషి విజయవంతం కావాలని ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు.

పునరుద్ధరిస్తాం

కొంతకాలం నుంచి పడావుగా ఉంటున్న బెల్లంపల్లి ఐటీడీఏ ఉద్యాన నర్సరీ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు ఐటీడీఏ ఇంచార్జి పీవో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే పనికి రాకుండా ఉన్న చెట్లను నరికి వేయించి కొత్తగా పలు రకాల మొక్కలు పెంచి నర్సరీ ఆదాయాన్నీ పెంచడానికి కృషి చేస్తాం. అభివృద్ధి చేయడానికి కావాల్సిన అన్ని రకాల చర్యలు తీసుకోవడానికి యత్నాలు జరుగుతున్నాయి.

– కోట కృష్ణయ్య, ఓఎస్‌డీ ఐటీడీఏ, ఉట్నూర్

పండ్ల తోటల పెంపకానికి ప్రణాళిక

ఉద్యానవన నర్సరీని అభివృద్ధి పరిచే దిశలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం నర్సరీలో మామిడి, సపోట, అల్లనేరేడు, పనస, దానిమ్మ తదితర రకాల ఫలసాయాన్నిచ్చే వృక్షాలు ఉన్నాయి. వీటికి తోడుగా కొత్తగా జామ, సీతాఫలం, పండ్లమొక్కలు, సర్వీ, సుబాబుల్, ఆయిల్‌ఫామ్ మొక్కలను పెంచి ఆదాయాన్ని సమకూర్చుకోవలాని ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. అదే తీరుగా కూరగాయలు, పూలమొక్కలు పెంచాలనే తలంపులో ఉన్నారు. వీటికి తోడు పండ్ల మొక్కల నర్సరీని కూడా పూర్వ పద్ధతిలో నిర్వహించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పండ్లు, కూరగాయలు, పూలసాగు చేపట్టి వాటి ద్వారా వచ్చే ఆదాయంతో ఉద్యాన నర్సరీని అభివృద్ధి చేయనున్నారు. మరోవైపు నర్సరీలో పూర్వం మాదిరిగానే వివిధ రకాలైన పండ్ల మొక్కలకు అంట్లు కట్టి అమ్మకాలు సాగించాలనే యోచనలో ఉన్నారు. వీటి ద్వారా పెద్దమొత్తంలో ఆదాయం సమకూరడంతోపాటు కూలీలకు ఉపాధి పనులు కల్పించడానికి సన్నాహాలు చేస్తుండడం గమనార్హం. గతంలో నర్సరీలో దాదాపు 140 మంది వరకు కూలీలు పని చేశారు. నర్సరీ నిర్వహణ గాడి తప్పడంతో అనివార్యంగా సదరు కూలీలను పనిలో నుంచి తప్పించారు. ప్రస్తుతం అలాంటి పనులకు తావివ్వకుండా సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- ప్రజల నుంచి అర్జీల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో కృషి చేస్తున్నామని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ చాంబర్‌లో ట్రెయినీ కలెక్టర్ గౌతమితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలువురు భూ సమస్యలు, డబుల్‌బెడ్రూం ఇళ్లు, పింఛన్లు, భూ పరిహారం, విద్యుత్ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. పలుమార్లు తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో అర్జీ సమర్పించినా పరిష్కారం కాకపోవడంతో కలెక్టరేట్‌కు వచ్చినట్లు అర్జీదారులు వాపోయారు.

- అనుమతి లేని శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. శ్రీరామ హైస్కూల్ గుర్తింపుతో పాఠశాల నిర్వహిస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఐక్య విద్యార్థి సంఘాల ఆరోపించారు. సౌకర్యాలు లేకున్నా కార్పొరేట్ స్థాయిలో ఫీజులు వసూలు చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, జుమ్మి గోపాల్, ఆర్యకొండ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

భూమి ఇవ్వలేదు



నా కొడుకును 1997లో పోలీసులు నక్సలైట్ల పేరుతో కాల్చి చంపారు. నా కొడుకు చనిపోవడంతో నా భర్త కూడా కుంగిపోయి చనిపోయాడు. ప్రభుత్వం ఆదేశంతో అప్పుడు రెండు ఎకరాల భూమి ఇస్తామని మంచిర్యాల తహసీల్దార్ 2012లో కాగితంపై రాసి ఇచ్చా రు. కానీ ఇంతవరకు ఇవ్వలేదు. ఇప్పటి తహసీల్దార్, ఆర్డీవో కలెక్టర్ ఆఫీస్‌కు 15 నుంచి 20 సార్లు నడిచాను. తిండికి తిప్పలు అవుతుంది. ఆర్థిక ఇబ్బందులతోపాటు గుండె ఆపరేషన్ అయ్యింది. నాకు భూమి ఇప్పించాలి.

– ఒరుగంటి నర్సమ్మ, సీసీసీ, నస్పూర్



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా


డబుల్ బెడ్రూం ఇళ్లపై మహిళల ఆందోళన

ధర్నాలు, ఆందోళనలు..

సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు మాట్లాడుతూ అధికారులు వేతనాలు చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఏడాదికాలంగా జిల్లాలో సివిల్ సప్లయి డీఎం లేక ప్రజాపంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని అన్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్లకు ఇన్‌చార్జిని నియమించాలని, గోదాముల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అక్బర్‌అలి, ఉపాధ్యక్షులు మిట్టపల్లి పౌలు, దేవి పోచన్న, రమణరెడ్డి, సివిల్ సప్లయి హమాలీ కార్మికులు పానుగంటి సత్తయ్య, టి.సత్తయ్య, భూమయ్య, పోరండ్ల సంపత్, రాజయ్య పాల్గొన్నారు.

అనర్హులకు ఇళ్లు కేటాయించారని..

భూములు, భవనాలు, ఇళ్లు ఉన్న అనర్హులను డబుల్‌బెడ్రూం ఇళ్లకు లక్కీడ్రాలో ఎంపిక చేశారని ఆరోపిస్తూ మంచిర్యాల పట్టణంలోని పలు వార్డులకు చెందిన మహిళలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఎంపిక, దరఖాస్తుల పరిశీలన, విచారణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు అందజేయాలని కలెక్టర్‌ను కోరారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలని


యూత్ కాంగ్రెస్ నాయకులు

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి బాధ్యులైన చైర్మన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, నైతిక బాధ్యత వహించి మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సోమవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు సంపత్‌రెడ్డి, అరిగెల తిరుమల్‌రావు, నాయకులు ఆడేపు రవి, రచ్చ నరేష్, లోహిత్, శశికుమార్, రాకేష్, వంశీకృష్ణ, సంతోష్, శేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు బలం

- మంచిర్యాల, కుమురంభీం జిల్లాల పార్టీ ఇన్‌చార్జి ‘నారదాసు’
- కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం


మాట్లాడుతున్న నారదాసు లక్ష్మణ్‌రావు

బెల్లంపల్లి: బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే కొండంత బలమని మాజీ ఎమ్మెల్సీ, మంచిర్యాల, కుమురంభీమ్ జిల్లాల పార్టీ ఇంచార్జీ నారదాసు లక్ష్మణ్‌రావు అన్నారు. సోమవారం బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం స్థానిక పద్మశాలి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయని అన్నారు. ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రిపై అసత్య ప్రచారం చేయడమే ప్రధాన విధిగా విపక్షాలు ముందుకు సాగుతున్నాయని విమర్శించారు. కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. పదవులు అందరికీ ఒకేసారి రావని, కొంత సమయం వేచి చూడాలని కోరారు. మూడోసారి సైతం బెల్లంపల్లి ఎమ్మెల్యేగా చిన్నయ్య గెలుస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆత్మీయ సమ్మేళనాలు ఏప్రిల్‌లో పూర్తి చేయాలని అన్నారు. ఏప్రిల్ 25న గ్రామ గ్రామాన పార్టీ జెండాను ఎగురవేసి సంబరాలు జరుపుకోవాలని వివరించారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ ఎన్నికల వేళ ఎవరెవరో వస్తున్నారని భయపడాల్సిన పని లేదని, నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పటిష్టంగా ఉందని తెలిపారు. వచ్చే ఐదు నెలలు అత్యంత కీలకమని, అందరూ సమష్టిగా పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

అమ్మానాన్నలకు దాతల సాయం


నగదు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి ఎఫెక్ట్..

నెన్నెల: ‘అమ్మానాన్నలను ఆదుకోండి’ శీర్షికన ‘సాక్షి’లో సోమవారం ప్రచురితమైన కథనానికి పలు వురు దాతలు స్పందించారు. మండల కేంద్రం నెన్నెలకు చెందిన తుత్తుర్ల రాజం పక్షవాతం, ఆయన భార్య లక్ష్మి క్యాన్సర్ బారిన పడి బాధపడుతున్నారు. వారి పిల్లలు పడుతున్న ఇబ్బందులు, తమ తల్లిదండ్రులను ఆదుకోవాలని వేడుకున్న తీరుపై ‘సాక్షి’లో ప్రచురితమైన కథనంతో పలువురు ఆర్థికసాయం అందజేశారు. బెల్లంపల్లికి చెందిన ప్రవాస భారతీయుడు తోడే కృష్ణారెడ్డి, గొల్లపల్లి ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్‌లు రూ.10 వేలు, కాంగ్రెస్ నేత నేతరి స్వామి(ఎల్లయ్య) రూ.5 వేలు అందజేశారు. బెల్లంపల్లి నిత్య పిల్ల ల ఆస్పత్రి యాజమాన్యం రూ.5 వేలు అందజేయగా, తుత్తుర్ల లక్ష్మీకి ఫోన్ పే, గూగుల్ పే ద్వారా కొందరు మానవతామూర్తులు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

క్లుప్తంగా

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

కోటపల్లి(చెన్నూర్): హత్య కేసులో మండలంలోని సర్వాయిపేటకు చెందిన నర్సనాయక్‌కు మంచిర్యాల జిల్లా కోర్టు సెషన్స్ జడ్జి బి.సత్తయ్య జీవిత ఖైదుతో పాటు రూ.500 జరిమానా విధించినట్లు సీఐ విద్యాసాగర్ తెలిపారు. చెన్నూర్‌కు చెందిన బెల్లంకొండ రాజ్‌కుమార్‌కు కోటపల్లి మండలంలోని సర్వాయిపేటకు చెందిన నర్సనాయక్ భార్యతో అక్రమ సంబంధం ఉందన్న అనుమానంతో 2018 జనవరి 15న అతన్ని హత్య చేయగా అప్పటి సీఐ కిషోర్, ఎస్సై వెంకన్న కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం తుది విచారణకు రాగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పులి రాజమల్లు కేసు వాదనలు వినిపించగా జడ్జి సత్తయ్య నిందితుడికి జీవిత ఖైదు విధించినట్లు సీఐ వివరించారు.

హమాలివాడలో చోరీ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హమాలివాడలో చోరీ జరిగినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. హమాలివాడకు చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి నరహరి బాలకృష్ణ ఈ నెల 18న తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. 19న రాత్రి ఇంటికి వచ్చే సరికి మెయిన్ డోర్ తాళం పగులగొట్టి ఉంది. దీంతో చోరీ జరిగిందని గ్రహించిన పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై రాజేందర్ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. 65 గ్రాముల బంగారు ఆభరణాలు, 70 తులాల వెండి, రూ.5 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు వాపోయాడు. సోమవారం బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

13 మంది బైండోవర్



బైండోవర్ చేస్తున్న రేంజ్ అధికారి

జన్నారం(ఖానాపూర్): జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నేరాలకు పాల్పడుతున్న 13 మందిని సోమవారం తహసీల్దార్ వెంకటకిషన్ ఎదుట బైండోవర్ చేశారు. స్మగ్లింగ్, వన్యప్రాణుల వేట, పోడు వ్యవసాయం, తదితర నేరాలకు పాల్పడుతున్న చింతగూడ గ్రామానికి చెందిన ముగ్గురు, కొత్తపేటకు చెందిన ముగ్గురు, బొమ్మెన, పైడిపెల్లి, కిష్టాపూర్, కొత్తూరుపల్లి, రేండ్లగూడ, దేవునిగూడ, కవ్వాల్ గ్రామాలకు చెందిన ఒక్కొక్కరిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు జన్నారం రేంజ్ అధికారి హఫీజొద్దీన్ తెలిపారు. మరోసారి అటవీ నేరాలకు పాల్పడితే ఏడాది జైలుశిక్ష, లేదా రూ.లక్ష జరిమానా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. వారి వెంట సెక్షన్ అధికారి శివకుమార్, బీట్ అధికారులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో యువతి మృతి

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ షాక్‌కు గురై మహారాష్ట్రకు చెందిన ఓ యువతి మృతి చెందినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని పాటన్‌బోరికి చెందిన యూనుస్ పఠాన్ పెద్ద కుమార్తె సుమయ్య పఠాన్(17) ఈనెల 19న ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన ఇనుప తీగలపై బట్టలు ఆరబెడుతుండగా విద్యుత్ షాక్‌కు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు పాటన్‌బోరి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి వైద్యుల సూచనలతో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ వివరించారు.

మిగిలింది పది రోజులే..

ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకున్నా జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూళ్లు నత్తనడకనే సాగుతున్నాయి. మరో పది రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఇప్పటి వరకు సగటున 60 శాతం మాత్రమే పన్నులు వసూలు చేశారు. పది రోజుల్లో 40 శాతం వసూలు చేయడం సాధ్యమయ్యే అవకాశం కనిపించడం లేదు. వందశాతం వసూలు చేస్తామని ఇప్పుడు అధికారులు హడావుడి చేస్తున్నారు. ఇదిలా ఉండగా పన్నుల వసూళ్లలో జిల్లాలోని లక్సెట్టిపేట మున్సిపాలిటీ 85 శాతంతో రాష్ట్రంలోనే ముందంజలో ఉంది. ఇక నస్పూర్ మున్సిపాలిటీ కేవలం 38 శాతంతో వెనుకబడింది.

- మున్సిపాలిటీల్లో నత్తనడకన పన్నుల వసూళ్లు
- 85 శాతంతో మొదటిస్థానంలో లక్సెట్టిపేట
- 38 శాతంతో నస్పూర్ లాస్ట్
- వందశాతం వసూలు కష్టమే..!



మూడేళ్లుగా పన్నుల వసూళ్లు ఇలా..

ఆర్థిక సంవత్సరం	లక్ష్యం	వసూలు చేసింది	చేయాల్సింది	శాతం
2020–21	156.81	75.63	81.18	48.23
2021–22	177.78	148.52	13.72	83.54
2022–23	154.57	132.25	22.32	85.56

పన్ను వసూళ్లలో లక్సెట్టిపేట మున్సిపాలిటీ ముందంజ ...

లక్సెట్టిపేట: జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో మూడేళ్లుగా ఆస్తిపన్ను వసూళ్లను గమనించినట్లయితే లక్సెట్టిపేట మున్సిపాలిటి 85 శాతం పన్నులు వసూలు చేసి ముందంజలో ఉంది. గడువులోగా వందశాతం పన్నులు వసూలు చేసేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పన్నుల వసూలులో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారు.

చెన్నూర్‌లో 61 శాతం..

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆస్తి పన్ను 61శాతం వసూలైనట్లు అధికారులు పేర్కొన్నారు. నిర్దేశిత పన్ను వసూలు లక్ష్యం కోటి 22 లక్షలు కాగా ఇప్పటి వరకు రూ.75 లక్షలు వసూలయ్యాయి. ఇంకా 47 లక్షల 34 వేలు వసూలు కావాల్సి ఉంది. పూర్తిస్థాయిలో ఆస్తిపన్ను వసూలు చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. ప్రజలు పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

మందమర్రిలో 52 శాతం

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆస్తిపన్ను 52 శాతం వసూలైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది ఆస్తిపన్ను మొత్తంగా రూ.3 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. కానీ ఇప్పటి వరకు రూ.కోటి 70 లక్షలు మాత్రమే వసూలైంది. ఇంకా కోటి 30 లక్షలు వసూలు చేయాల్సి ఉందని మున్సిపల్ మిషనర్ గద్దె రాజు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి పూర్తిస్థాయిలో పన్నుల వసూలు చేయాలని లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

క్యాతనపల్లిలో 65 శాతం

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలో 2022–23 ఆర్థిక సంవత్సరానికిగానూ ఆస్తి పన్ను వసూలు లక్ష్యం రూ.282.50 లక్షలుగా నిర్దేశించారు. కానీ ఇప్పటి వరకు రూ.181.49 లక్షలు (65 శాతం) వసూలయ్యాయి. ఇంకా 101.01 లక్షలు వసూలు చేయాల్సి ఉంది. కాగా గత ఆర్థిక సంవత్సరం 2021–22లో నిర్దేశిత లక్ష్యం 168 లక్షలు కాగా 125 లక్షలు వసూలు చేసినట్లు మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. .

బెల్లంపల్లిలో 58 శాతం..

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఆస్తిపన్ను వసూళ్లు నత్తనడకన సాగుతున్నాయి. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవడంలో అధికారులు వెనుకంజలో ఉన్నారు. మరో పక్షం రోజుల్లో 2022–23 ఆర్థిక సంవత్సరం ముగియనుండగా ఇప్పటి వరకు కేవలం 58 శాతం మాత్రమే వసూలయ్యాయి. మున్సిపాలిటీలోని 34 వార్డుల్లో 13,343 నివాసాలు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వీటి ద్వారా మున్సిపాలిటీకి రూ.2.17 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.1.23 కోట్లు మాత్రమే వసూలైంది. ఇంకా రూ.94 లక్షలు వసూలు చేయాల్సి ఉంది. ఈ నెలాఖరు వరకు పన్ను వసూలు లక్ష్యాన్ని పూర్తి చేయాలనే పట్టుదలతో అధికారులు, సిబ్బంది ముందుకు సాగుతున్నారు. గతేడాది 92 శాతం పన్నులు వసూలు కాగా 8 శాతం పెండింగ్‌లో ఉన్నాయి. అంతకు ముందు ఏడాది 95 శాతం వసూలు చేశారు. మరి ఈ ఏడాది పూర్తిస్థాయిలో వసూలు చేస్తారా? లక్ష్యసాధనలో వెనుకబడిపోతారా? అనేది పది రోజుల్లో తేలనుంది. మొండి బకాయిలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలనే తలంపులో బల్దియా అధికారులు ఉన్నారు. ముందస్తుగా డిమాండ్ నోటీసులు అందించి పన్నులు రాబట్టుకోవాలని చూస్తున్నారు. అప్పటికీ స్పందించకపోతే అవసరమైతే రెడ్ నోటీసులు జారీ చేయడం, రెవెన్యూ రికవరీకి ఆదేశించడం జరుగుతుందని ఓ అధికారి తెలిపారు.

మంచిర్యాలలో 53.30 శాతమే

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో ఆస్తిపన్ను వసూలు ఈ ఏడాది లక్ష్యాన్ని చేరుకోవడం కష్టతరంగానే కనిపిస్తోంది. రెండేళ్ల క్రితం 95.71శాతం పన్నులు వసూలు కాగా గతేడాది 59.14శాతం, ఈ ఏడాది ఇప్పటి వరకు 53.30 శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయి. లక్ష్యం చేరుకోవడానికి ఇంకా గడువు పదిరోజులు మాత్రమే మిగిలి ఉంది. రెండేళ్ల క్రితం వరకు ఆస్తి పన్ను చెల్లించని వారికి మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేసి ఆస్తులను జప్తు చేసేలా చర్యలు తీసుకోవడంతో దాదాపుగా అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు. కానీ గతేడాది నుంచి పన్ను వసూళ్లు అంతంత మాత్రంగానే జరుగుతున్నా కఠినచర్యలు తీసుకోవడంలో అధికారులు, విఫలమవుతున్నారు. బకాయిలు ఉన్నవారికి నో టీసులు ఇచ్చి నల్లా కనెక్షన్‌లను తొలగిస్తున్నా అనుకున్న మేర పన్నులు వసూలు కావడంలేదు.

ఆర్థిక సంవత్సరం	లక్ష్యం	వసూలైంది	కావాల్సింది	శాతం
2020–21	11.94 కోట్లు	11.43 కోట్లు	51.26	95.71
2021–22	14.96	8.85	6.11	59.14
2022–23	16.22	8.65	7.57	53.30

నస్పూర్‌లో 38 శాతం మాత్రమే..

నస్పూర్: పట్టణ పరిధిలో మొత్తం 16,712 అసెస్‌మెంట్స్ ఉండగా మున్సిపల్ అధికారులువాటికి రూ.4.5 కోట్ల వార్షిక లక్ష్యాన్ని నిర్దేశించారు. కానీ ఇప్పటి వరకు రూ.1.6 కోట్ల వరకు మాత్రమే పన్నులు వసూలైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు కేవలం 38 శాతం మాత్రమే పన్నులు వసూలు చేశారు. మిగిలిన పది రోజుల్లో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంటారో లేదో చూడాలి.

సింగరేణి సంస్థ సహకరించేనా...

నస్పూర్ పట్టణ పరిధిలో నస్పూర్, సింగాపూర్, తీగల్‌పహడ్, తాళ్లపల్లి గ్రామాలను కలిపి నస్పూర్ మున్సిపాలిటీగా ఏర్పాటైంది. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కువగా సింగరేణి సంస్థకు చెందిన క్వార్టర్లు, కార్యాలయాలు, ఫంక్షన్ హాల్స్, తదితర నిర్మాణాలు ఉన్నాయి. వీటికి గానూ సింగరేణి యాజమాన్యం అప్పటి గ్రామ పంచాయతీ నిబంధనల ప్రకారం ఏడాదికి రూ.49 లక్షలు ఆస్తిపన్ను రూపేనా మున్సిపాలిటీకి చెల్లిస్తోంది. మూడేళ్ల వరకు అప్పటి నిబంధనల ప్రకారం మాత్రమే చెల్లిస్తూ వచ్చింది. కానీ ప్రస్తుతం మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం ఏడాదికి సింగరేణి రూ.4 కోట్లు చెల్లించాల్సి ఉందని మున్సిపల్ అధికారులు తెలిపారు.

ఆర్కే న్యూటెక్ గని జీవితకాలం పెంపు

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఆర్కే న్యూటెక్ గని జీవిత కాలం మరో మూడేళ్లు పెంచినట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం బీ. సంజీవరెడ్డి తెలిపారు. సోమవారం గనిపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గనిలోపల సీ డీప్‌లోని బొగ్గు నిల్వలను గుర్తించామన్నారు. బొగ్గు తీసేందుకు డీజీఎంఎస్‌కు విన్నవించగా అనుమతిరావడంతో జీవిత కాలం పెరిగిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భూగర్భగనులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దీని కోసం ప్రతీ బొగ్గుపెళ్లను బయటికి తీయాలన్నారు. గని వార్షిక లక్ష్యాన్ని 41 రోజులు ముందుగానే సాధించడం అభినందనీయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం త్యాగరాజు, ఏజెంట్ సత్యనారాయణ, మేనేజర్ స్వామిరాజు, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఇంజినీర్ రాజగోపాల్‌చారి, వెంటిలేషన్ అధికారి శంకరయ్య, సంక్షేమాధికారి పాల్‌సృజన్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

అనుమానాస్పదంగా యువతి మృతి

కెరమెరి(ఆసిఫాబాద్): అనుమానాస్పదంగా యువతి మృతి చెందిన సంఘటన కెరమెరి మండలంలోని అగుర్‌వాడలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం అగుర్‌వాడకు చెందిన జుగ్నాక లచ్చు, దుర్పతబాయి దంపతులకు కుమారుడు, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. చిన్నకూతురు జుగ్నాక రేణుక (26) నిర్మల్ పట్టణంలోని జాగృతి ప్రైవేటు ఆస్పత్రిలో నర్సు ఉద్యోగం చేస్తోంది. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేట్‌కు చెందిన జాటోత్ రమేశ్ నిర్మల్‌లోనే పాన్‌షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇద్దరూ ప్రేమించుకున్నారు. 2018 నుంచి సహజీవనం చేస్తున్నారు. రేణుక గర్బం దాల్చడంతో ప్రసవం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం రక్తహీనతతో మృతి చెందింది. ఆదివారం రాత్రి రమేశ్ యువతి మృతదేహాన్ని కెరమెరి మండలంలోని సుల్తాన్‌గూడ సమీపంలో ఉన్న వంతెన వద్ద పడేసి మృతురాలి తండ్రికి ఫోన్ చేసి సమాచారం అందించాడు. అయితే తమ కుమార్తె మృతికి రమేశ్ కారణమని, అతనిపై చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి లచ్చు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే నిజంగానే రేణుక రక్తహీనతతో మృతి చెందిందా? లేక హత్య చేశాడా? అనే విషయం తేలాల్సి ఉంది.



రేణుక మృతదేహం

మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ఆదివాసీల ధర్నా

ఆసిఫాబాద్అర్బన్: రేణుక మృతికి కారకుడైన వ్యక్తిని ఉరితీయాలని డిమాండ్ చేస్తూ తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోట్నాక విజయ్ ఆధ్వర్యంలో సోమవారం యువతి మృతదేహంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఆదివాసీ, తుడుందెబ్బ నాయకులు తుకారాం, లచ్చు, సోము, సోనేరావ్, భీంరావ్, అనంత్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

మహా సమ్మేళనంపై అసత్య ఆరోపణలు

- పారదర్శకంగా ఆర్థిక లావాదేవీలు
- సింగరేణి పాఠశాల మహా సమ్మేళన సమన్వయకర్తలు




సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సమన్వయ కర్తలు

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి పాఠశాలలో ఫిబ్రవరి 12న జరిగిన పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనానికి వచ్చిన డబ్బులు, ఖర్చులకు పారదర్శకంగా లెక్కలు ఉన్నాయని మహా సమ్మేళన సమన్వయకర్తలు తెలిపారు. సోమవారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సమన్వయకర్తలు కొమగిరి వాణిశ్రీ, రాజారెడ్డి, రాపోలు విష్ణువర్ధన్‌రావు విలేకరులతో మాట్లాడారు. మహా సమ్మేళనంలో డబ్బులు దుర్వినియోగం చేశారని కొందరు పూర్వ విద్యార్థులు పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండించారు. వ్యక్తిగత కక్షలతో చేసిన తప్పుడు ఆరోపణలని, ప్రతీపైసాకు తమ వద్ద లెక్కుందని తెలిపారు. రూ.40 లక్షలు వసూలు అయ్యాయని అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అన్ని బ్యాచ్‌ల పూర్వ విద్యార్థుల నుంచి రూ.30,40,362 వసూలైనట్లు తెలిపారు. సమ్మేళనానికి, పాఠశాలకు టీవీ, వాటర్ ప్యూరిఫైడ్, ఇతర సామగ్రితో సహా ఇప్పటి వరకు రూ.28,03,530 ఖర్చు అయ్యాయన్నారు. సమ్మేళనం తర్వాత సమావేశం ఏర్పాటు చేసి వచ్చిన డబ్బులు, ఖర్చు, వెండర్లకు ఇచ్చినవి బ్యాంక్ స్టేట్‌మెంట్ల పత్రాలతో సహాయ అన్ని వివరాలను కమిటీలో సమర్పించామని అన్నారు. వారు చేసిన ఆరోపణలు రుజువు చేయాలని సవాల్ చేశారు. లేనిపక్షంలో బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై వారు స్పందించకుంటే పరువు నష్టం దావా కేసు వేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మహా సమ్మేళన నిర్వాహకులు డప్పు సమ్మయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, కే.తిరుపతి, పీ.సురేందర్‌రెడ్డి, జక్కుల మల్లేశ్, నల్ల సంపత్, రేఖాటాగూర్, శంకర్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న భక్తిభావం

- సేవాలాల్ నామస్మరణలో గ్రామాలు
- 756 తండాల్లో 28 వేలమంది భక్తులు
- దీక్షలపై యువత ఆసక్తి



సంత్ సేవాలాల్ మహారాజ్



జగదాంబదేవికి పూజలు చేస్తున్న భక్తులు

కెరమెరి(ఆసిఫాబాద్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని తండాలు భక్తిభావంలో మునిగిపోతున్నాయి. నాడు ప్రేంసింగ్ మహారాజ్ చేపట్టిన దీక్ష నేడు తండాల్లో విస్తరించింది. బంజారాల కులగురువైన సేవాలాల్ మహారాజ్ లీలా గానంలో లీనమైపోవాలన్న లంబాడ(బంజారా) ప్రజలు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. కఠోర దీక్ష.. కఠిన నియమాలు పాటిస్తున్నారు. 1979లో మహాతపస్వి, దీక్ష గురువైన ప్రేంసింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో 1600 మందితో నార్నూర్ మండలం కొత్తపల్లిలో ప్రారంభమైన దీక్ష 44 ఏళ్లుగా కొనసాగుతోంది. మహాశివరాత్రి నుంచి ప్రారంభమైన దీక్షలు శ్రీ రామ నవమి వరకు కొనసాగుతాయి. 11, 21, 41 రోజులపాటు దీక్షలు స్వీకరించవచ్చు. మరో పదిరోజుల్లో దీక్షలు ముగియనున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 28 వేల మంది భక్తులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 756 తండాల్లో సుమారు 28 వేల మంది సేవాలాల్ భక్తులు ఉన్నారు. ఇందులో 13 వేల మంది యువకులు, 5 వేల మంది మహిళలు ఉన్నారు. కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు), ఉట్నూర్, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఇచ్చోడ, నేరడిగొండ, ఆసిఫాబాద్, రెబ్బెన, తిర్యాణి, ఖానాపూర్, మామడ, తదితర మండలాలతో పాటు ఇతర మండలాల్లో కూడా భక్తులు దీక్షలు చేపట్టారు. ఒక్కో మండలంలో 100కు పైగానే సేవాలాల్ భక్తులు ఉన్నారు. అయితే ఎక్కువశాతం 11 రోజుల దీక్షను స్వీకరిస్తారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్న భావనే వారిని భక్తిమార్గం వైపు నడిపిస్తోంది. దీక్షలో ఉన్న సమయంలో చెడు మాట్లాడడం, చెడు వినడం, అబద్ధాలు ఆడడం, ఒకరి గురించి చెడుగా ఆలోచించడం లాంటివి చేయకూడదు. చెప్పులు లేకుండా నడవాలి. ప్రతీరోజు ఒకపూట మాత్రమే భోజనం చేయాలి.

శ్రీరామ నవమికి విరమణ

సేవాలాల్ దీక్ష చేపట్టిన భక్తులంతా శ్రీరామ నవమి రోజున మహారాష్ట్రలోని యవత్‌మాల్ జిల్లాలో ఉన్న పొహరాదేవి గ్రామానికి తరలివెళ్తారు. గ్రామంలో కొలువైన జగదంబాదేవి సమక్షంలో దీక్ష విరమణ చేస్తారు.

24 ఏళ్లుగా దీక్ష



నేను 24 ఏళ్లుగా సేవాలాల్ దీక్ష స్వీకరిస్తున్నా. అప్పటి నుంచీ అంతా మంచే జరుగుతోంది. ప్రతీ సంవత్సరం 41 రోజులపాటు దీక్షలోనే ఉంటా. అంతకు ముందు కష్టాల్లో ఉన్న నాకుటుంబం ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయి ప్రస్తుతం హాయిగా జీవిస్తున్నాం. ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో నడవాలి.– సున్నాబాయి, కెరమెరి

పోస్టల్ ద్వారా రాములోరి తలంబ్రాలు

ఆదిలాబాద్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాద్రిలో శ్రీ సీతారామ కల్యాణానికి వినియోగించే తలంబ్రాలను పోస్టల్ ద్వారా అందజేస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సీనియర్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్పీడ్‌పోస్ట్ ద్వారా 10 గ్రాముల తలంబ్రాలు, 2 ముత్యాలు, పసుపు, కుంకుమ, మిశ్రి, 80 గ్రాముల కాజు ప్రసాదం ఇంటి వద్దకే డెలివరీ చేస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా రూ.150 చెల్లిస్తే 20 గ్రాముల కల్యాణ తలంబ్రాలు, రెండు ముత్యాలు అందిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పోస్టాఫీస్‌లో రూ.450 చెల్లించి ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు. ఇందుకోసం https:// eshop. tsposts. in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 28వ తేదీ వరకు బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నీటి సమస్య తీర్చాలని ధర్నా



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

భీమిని(బెల్లంపల్లి): కన్నెపల్లి మండల కేంద్రంలో నీటి సమస్య తీర్చాలంటూ సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎదుట ఖాళీ బిందెలతో మహిళలు, కాలనీవాసులు ధర్నా నిర్వహించారు. గత 20 రోజులుగా నీటి సరఫరా సరిగా చేయకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని, ఎండాకాలం ప్రారంభమైనందున సమస్యను వెంటనే తీర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ రాధాకిషన్‌కు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కారానికి ఎంపీడీవో హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. గోమాస డాగయ్య, గుజ్జుల మోహన్, భాస్కర్, గొస్కుల బాపు, వెంకటేష్, మోహన్, కోట రాధ, దుర్గం రాణి, సుష్మిత తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు అస్వస్థత



రెబ్బెన పీహెచ్‌సీలో విద్యార్థినులు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గంగాపూర్ కస్తూరిబా విద్యాలయంలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులు ఆదివారం రాత్రి ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. పలువురు విద్యార్థినులు తీవ్రమైన దగ్గుతో బాధపడుతుండగా పాఠశాల సిబ్బంది హుటాహుటిన రెబ్బెన పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. ఈ విషయమై పాఠశాల ఎస్‌వో పద్మను వివరణ కోరగా ఐదుగురు విద్యార్థినులకు దగ్గు రావడంతో వెంటనే పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స అందించామన్నారు. విద్యార్థులంతా క్షేమంగానే ఉన్నారన్నారు. అయితే ఒక్కసారిగా దగ్గు రావటానికి గల కారణం తెలియలేదన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ సోమవారం సంఘం ఆధ్వర్యంలో డీఈవో వెంకటేశ్వర్లు, కలెక్టరేట్‌లో వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. కేజీబీవీ, యూఆర్‌ఎస్ బోధన, బోధనేతర, సీఆర్పీ, ఎంఐసీసీవో, సీసీవోలు, ఐఈఆర్పీ, పీటీఐలు, మెసెంజర్, డీపీవో స్టాఫ్‌ను క్రమబద్ధీకరించాలని, ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్యబీమా రూ.5లక్షల సౌకర్యం కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వోలు సుమలత, శ్రీవాణి, సరిత, కవిత, ఎంఐఎస్ కోఆర్డినేటర్ నగేష్, సీఆర్పీ రాజన్న, సీసీవో రాంబాబు, రాకేష్, మెసెంజర్ స్వామి, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.



డీఈవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు